# హైబ్రిడ్ నారుకు భలే డిమాండ్

- వర్షాలు కురుస్తున్నందున జోరుగా ఆకు, కాయగూరల మొక్కల విక్రయాలు
- ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌లో అధికంగా ఏర్పాటైన నర్సరీలు
- రూపాయికో మొక్క చొప్పన అమ్మకం
- కొనుగోలు చేస్తున్న అన్నదాతలు, నగరవాసులు
- స్వయం ఉపాధి పొందుతున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం రూరల్, జూలై 29 : ఆరోగ్యం బాగుండాలంటే.. ఆకుకూరలతోపాటు కాయగూరలూ చాలా ముఖ్యమే. అందుకే కూరగాయల నర్సరీలకు భలే డిమాండ్ ఉన్నది. గతంలో వర్షాలు కురువగానే రైతులు గ్రామాల్లోని తమ పొలాల్లో నారు పోసేవారు. కానీ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నర్సరీల్లో హైబ్రిడ్ రకం విత్తనానికి సంబంధించిన నారు దొరుకుతుండడంతో రైతులంతా ఈ నారుపై మక్కువ చూపుతున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, ఆగాపల్లి, ఆరుట్ల, నోముల, శేరిగూడ, మంగల్‌పల్లి, పోల్కంపల్లి, పోచారం, రాయపోల్, ఉప్పరిగూడ, గున్‌గల్ తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేసి నర్సరీల్లో పండ్లు, వివిధ రకాల కూరగాయల నారును పెంచుతున్నారు. రూపాయికో మొక్కను విక్రయిస్తుండగా, లక్షల్లో విక్రయాలు సాగుతున్నాయి. అన్నదాతలు ఈ నారు కొని తీసుకెళ్లి తమ పొలాల్లో.. అదేవిధంగా హైదరాబాద్ నగరవాసులు తమ ఇంటి పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాలు, డాబాలపై మట్టి కుండీలు, తొట్లల్లో మొక్కలను నాటి ఆకు, కాయగూరలను పెంచుతున్నారు.

### మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు..

కూరగాయల నర్సరీలకు డిమాండ్ ఏర్పడడంతో ఔత్సాహికులు వాటిని ఏర్పాటుచేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, కందుకూరు, మహేశ్వరం, షాబాద్, షాద్‌నగర్, చేవెళ్లతోపాటు పలు మండలాల్లోనూ నర్సరీలను ఏర్పాటు చేశారు. కేవలం ఎకరం వ్యవసాయ భూమిలోనే నర్సరీలను ఏర్పాటు చేసి హైబ్రిడ్ రకానికి చెందిన కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో టమాట, బీరకాయ, వంకాయ, గోబీపువ్వు, క్యాబేజీ, మిరపతోపాటు పండ్లు, పూల మొక్కలను సాగుచేస్తున్నారు. ఇందుకోసం మినీఫాములను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రత్యేకంగా ప్లాస్టిక్ కుండీల్లో వివిధ రకాల విత్తనాలు వేసి మొక్కలను పెంచుతున్నారు. ఇందుకోసం కొబ్బరి పీచు, నల్లమట్టి, సేంద్రియ ఎరువులను వినియోగించడంతో నాటిన పది రోజుల్లోనే మొలకలు వస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వారికి ఉపాధిని కల్పిస్తున్నారు.



ఓ ప్రైవేట్ నర్సరీలో పెంచుతున్న కూరగాయల నారు



కూరగాయల నారును పెంచేందుకు బాక్సుల్లో ఎరువుతో కూడిన మట్టిని నింపుతున్న కూలీలు

### అందుబాటులో వివిధ రకాల మొక్కలు..

గతంలో రైతులు తమ వ్యవసాయ పొలాల్లో కూరగాయలు, పూల పంటలను సాగు చేయాలంటే నెలరోజుల ముందుగానే విత్తనాలతో నారుపోసి పంటలను సాగుచేసేవారు. కానీ, ప్రస్తుతం ప్రతి మండల కేంద్రంలోనూ రెండు నుంచి పది వరకు ప్రైవేట్ నర్సరీలు ఏర్పాటు కావడంతో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మంచి రకం మొక్కలను కొని తమ పొలాల్లో విత్తుతున్నారు. రైతులు సాగుచేసే కూరగాయలు వంకాయ, టమాట, మిరప, బెండకాయ, క్యాబేజీతోపాటు పలు రకాల పండ్లు, పూల మొక్కల నారు నర్సరీల్లోనే అందుబాటులో ఉండడంతో వాటిని తీసుకెళ్లి పంటలు సాగుచేసుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

### నాణ్యమైన నారే లభిస్తున్నది..



గతంలో కూరగాయలను పండించాలంటే ముందుగా విత్తనాలు కొని నారుపోసి పంటలు సాగు చేసేవారం. కానీ, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రైవేట్ నర్సరీలు ఏర్పాటై.. హైబ్రిడ్ రకానికి చెందిన కూరగాయలు, పండ్లు, పూల మొక్కల నారు లభ్యం కావడంతో.. అన్నదాతలు దానిని కొనుగోలు చేసి.. పొలాల్లో పెంచి మంచి దిగుబడిని పొందుతున్నారు. నాణ్యమైన నారునే విక్రయిస్తున్నారు. -మొద్దు అంజిరెడ్డి, రైతు



# రికార్డుల తనిఖీ

బషీరాబాద్ ఠాణాను తనిఖీ చేసిన వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

బషీరాబాద్, జూలై 29 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, రిసెప్షన్, లాకప్, టెక్నికల్‌రూం, ఠాణా పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి, విధులకు సంబంధించిన వారికి సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మర్యాదగా వ్యవ హరించాలని.. ఎళ్లవేళలా ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. గ్రామాలు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. ప్రజల సహకారంతో జిల్లాను నేరరహిత జిల్లాగా మారుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

# సివిల్ తగాదాల్లో సీఐ..!

- వృద్ధ దంపతులను బెదిరించినట్లు సోషల్ మీడియాలో వైరల్
- యాచారం ఠాణాను సందర్శించిన ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు..ఘటనపై ఆరా

యాచారం, జూలై 29 : మండలంలోని కిషన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ భూమికి సంబంధించిన (కోర్టులో కేసు నడుస్తున్న) కేసులో సీఐ శంకర్‌కుమార్ తలదూర్చాడని సోషల్ మీడియాలో సోమవారం వైరల్ అయ్యింది. వృద్ధ దంపతులను ఠాణాకు పిలిపించి తాము చెప్పినట్లు వినకుంటే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని బెదిరించినట్లు పోలీసులపై తీవ్ర ఆరోపణలు వెలువెత్తాయి. దీనికి సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పులు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం సీపీ వరకు వెళ్లింది. దీంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు యాచారం ఠాణాను సందర్శించి ఘటనపై ఆరా తీశారు. కాగా గొడవ పడుతున్న రెండు కుటుంబాలకు చెందిన వారు ఠాణాకు రాగా భూవివాదానికి సంబంధించిన కేసు కోర్టులో ఉండడంతో తామేమీ చేయలేమని.. తీర్పు వచ్చేవరకు సంయమనం పాటించాలని వారికి సూచించినట్లు సీఐ శంకర్‌కుమార్ చెప్పారు. వృద్ధ దంపతులను బెదిరించినట్లు జరుగుతున్న ప్రచారం అంతా తప్పేనని తాను ఎవరినీ వేధించలేదన్నారు. కేసు విచారిస్తున్న సమయంలో వీడియో తీసి, దానిని సోషల్ మీడియాలో పెట్టి యాచారం పోలీసులు సివిల్ కేసుల్లో తలదూర్చుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఐ పేర్కొన్నారు. కోర్టులో ఉన్న కేసు విషయంలో సీఐ శంకర్ కుమార్ వృద్ధ దంపతులను అదుపులోకి తీసుకొని బెదిరించడం, వేధించడం ఎంత వరకు సమంజసమని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం



మండలంలోని కొత్తపల్లితండా సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఓ భారీ బండరాయి పక్కనే ఉన్న గుట్టపై నుంచి దొర్లుతూ వచ్చి రోడ్డుపై పడింది. గత నాలుగైదు రోజులుగా రోడ్డుకు అడ్డంగా బండరాయి ఉన్నా దానిని ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో ఆర్టీసీ బస్సులు, వాహనదారులు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో బండరాయి ఉన్న విషయం తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నది.

సంబంధిత శాఖ అధికారులు ప్రమాదాలు జరుగక ముందే స్పందించి.. బండరాయిని అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. -యాచారం, జూలై 29

# సుదూర మార్గాలకు ఆర్టీసీ బస్సులు!

- గ్రేటర్‌లో సుదూర ప్రాంతాలకు సేవలందేలా ప్లాన్
- ఇప్పటికే ఐదు మార్గాలకు బస్సులు
- తాజాగా మెహిదీపట్నం టూ కందవాడకు బస్సు
- మరో నాలుగు మార్గాల్లో బస్సు సేవలపై పరిశీలన



సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరం ఓ విశ్వనగరంగా మారింది. ఇక్కడ భిన్న వర్గాల ప్రజలు ఆవాసం పొందుతుండటంతో నగరం రోజు రోజుకూ పెద్ద ఎత్తున విస్తరిస్తున్నది. అయితే, పబ్లిక్ రవాణాకు సంబంధించి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో ఉండే విద్యార్థులు, ప్రజలకు నగరంలోని గమ్యస్థానాలకు చేరుకోవడానికి తీవ్ర సమస్యగా మారింది. ప్రధానంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. కనీసం మూడు, నాలుగు బస్సులైనా మారాల్సిన దుస్థితి. ఈ పరిస్థితుల్లో నగర శివారు ప్రాంతాల నుంచి నేరుగా రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు బస్సులను ప్రవేశపెడుతున్నారు. ఇప్పటికే ఐదు రూట్లల్లో బస్సులను ప్రవేశపెట్టిన గ్రేటర్ ఆర్టీసీ అధికారులు తాజాగా సోమవారం మెహిదీపట్నం – కందవాడ విలేజీ (నెం.592) రూట్‌లో మరో కొత్త బస్సు ప్రవేశపెట్టినట్టు గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నానల్ నగర్, లంగర్ హౌజ్, టీకే బ్రిడ్జి, బండ్లగూడ, అరె మైసమ్మ, గోల్డెన్ ఫామ్స్, ఉస్మాన్ సాగర్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్, కేతిరెడ్డిపల్లి మీదుగా గమ్యస్థానాన్ని చేరుకుంటుంది. మెహిదీపట్నం నుంచి మొదటి బస్సు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. కందవాడ నుంచి మొదటి బస్సు 9:25 గంటలకు ప్రారంభం కానుంది. ఇలా అనేక సుదూర రూట్లలో ఆర్టీసీ బస్సు సేవలను ప్రవేశపెడుతుంది. అంతే కాదు మరో నాలుగు రూట్లల్లో బస్సులను ప్రవేశపెట్టడంపై అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని డైరెక్ట్ కనెక్టివిటీని పెంచేందుకు ఆర్టీసీ అధికారులు రూట్ స్టడీ నిర్వహిస్తున్నారు. వివిధ రూట్లలో ఎంత మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారో వివరాలు ఆరా తీస్తున్నారు. వాటి ఆధారంగా పలు మార్గాల్లో బస్సులను ప్రవేశపెడుతున్నారు. ఇప్పటికే ఘట్‌కేసర్ టూ కొండాపూర్, పటాన్ చెరు – దిల్‌షుక్‌నగర్, ఆరాంఘర్ – కొండాపూర్, ఈసీఐఎల్ – మెహిదీపట్నం రూట్లలో బస్సులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.



పరిగి : బోనాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

# ఘనంగా పోచమ్మ బోనాలు

పరిగి, జూలై 29 : మండలంలోని మిట్టకోడూర్ గ్రామంలో సోమవారం పోచమ్మ తల్లికి స్థానికులు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. సాయంత్రం మహిళలు, యువతులు తలపై బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికెళ్లి ప్రదక్షిణలు చేసి బోనాలు, నైవేద్యాన్ని సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

### వికారాబాద్‌లో..

వికారాబాద్, జూలై 29 : వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ, ఎన్నేపల్లి కాలనీల్లో గ్రామ దేవత పోచమ్మ తల్లికి మహిళలు బోనాలు తీశారు. శివశత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్లు కృష్ణ , గోపాల్, అనంతరెడ్డి, కాలనీవాసులు మల్లేశం, సురేశ్, యాదయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



### పీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి మురళీధర్ తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారానికి సోమవారం వికారాబాద్ జిల్లా ఆర్టీసీ డిపోలో 'నిధి ఆప్కే నిఖత్ 2.0' పేరిట క్యాంప్ నిర్వహించారు. ప్రావిడెంట్ ఫండ్ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌బాబు సమస్యలు, పుట్టిన తేదీ తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం ప్రావిడెంట్ ఫండ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ప్రెస్టేజ్ ఎంప్లాయిస్ సభ్యుడు మల్లేశం ప్రసంగించారు. అనంతరం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

-వికారాబాద్, జూలై 29



### మరకత శివాలయంలో పూజలు

శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామ శివారులో 11వ శతాబ్దానికి చెందిన బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. బుల్లితెర నటి, అత్తారింటికి దారేది, కృష్ణ ముకుందా మురారి సీరియల్ ఫేమ్ భార్గవి స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన పూజారి సాయిశివ, ఆలయ ఆల్ ఇండియా ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌రాజు, ఆలయ గౌరవాధ్యక్షుడు సదానందంగౌడ్ నటి భార్గవికి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, సభ్యుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

-చేవెళ్ల రూరల్, జూలై 29



### బుగ్గన జీవితంపై ఫొటో షూటింగ్ ప్రారంభం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో.. పల్లెపల్లె తిరిగి ప్రజా పోరాటాలు నిర్వహించిన ప్రజాఉద్యమకారుడు బుగ్గన యాదవ్ జీవితంపై ఫొటో షూటింగ్ నిర్వహించడం అభినందనీయమని అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వెంకటయ్య అన్నారు. సోమవారం మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ఆయన స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ఫొటో షూటింగ్‌ను ఆయన ప్రారంభించారు. బుగ్గన్న విగ్రహాన్ని పరిగి పట్టణంలో ప్రతిష్ఠించేందుకు కృషి చేస్తున్న నాయకులు రామన్న మాదిగ, బందయ్య యాదవ్, సునంద, ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహులు, గోవింద్‌రెడ్డిలను ఉపాధ్యాయుడు వెంకటయ్య అభినందించారు. కార్యక్రమంలో బుగ్గన్న కుమారుడు తరుణ్ యాదవ్, ఆంజనేయులుగౌడ్, సత్యగౌడ్, దస్తయ్య, మహేశ్, రాజు, శంకర్ బృందం, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్ గ్రామాలవాసులు బుగ్గన్న అభిమానులు పాల్గొన్నారు.

-కులకచర్ల, జూలై 29

### ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి



ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కావలి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ గణేశ్ ముదిరాజ్, గుండా పీఏసీఎస్ వైస్ చైర్మన్ భిక్షపతి ముదిరాజ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలయ్య ముదిరాజ్ తదితరులు సోమవారం జ్ఞానేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

-చేవెళ్లటౌన్, జూలై 29







## అంబారీపై అమ్మవారి విగ్రహ ఊరేగింపు

ఆషాఢ మాస బోనాల్లో భాగంగా సోమవారం పాతబస్తీ లాల్ దర్వాజా పరిధుల్లో రంగం, బలిగంప, గావు పట్టుట మొదలైన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రధానంగా అంబారీపై అమ్మవారి విగ్రహ ఊరేగింపు, భక్తులకు అమ్మవారి సేవ మొదలైనవి భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. తొట్టెలను గణేశ్ ఘాట్ వరకు భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.